## చిట్టి కథ



# మధ్యతరగతి మనస్తత్వాలు

సరళ వంటగదిలో వనులతో కుస్తీపడుతోంది. అప్పుడే ఎనిమిదయ్యింది. బైట రిక్షావాడు బెల్లు మోగిస్తున్నాడు. రమకి అన్నం పెట్టింది కంచంలో. అన్నం పొగలుకక్కుతోంది. ఆ వేడి అన్నాన్ని కలుపుకోలేక నతమతమౌతోంది రమ. 'తొందరగా తిను' అంటూ తొందర పెట్టోంది రమని. రిక్షా గంట మోగుతూనేవుంది. 'ఉండు. రెండు నిమిషాలు ఆగు. వస్తోంది' అంటూ వంటగదిలోనుండే కేకేసింది. రెండేళ్ల పిల్లవాడు చిన్ని అమ్మకొంగు పట్టిలాగుతూ చేతికందినవన్నీ లాగుతున్నాడు. వాడికి నాలుగు దెబ్బలు అంటించింది సరళ. వాడు ఏడుపొక్క-రాగం ఆరంభించాడు. ప్రతిరోజూ ప్రొద్దుట పూట ఉండే హడావుడే ఇది. ఇంట్లో ఇంత జరుగుతున్నా తనకేమీ పట్టనట్లు వాకిట్లో ఈజీఛెయిర్‌లో కూర్చుని పేపరు చదువుతున్న ఈశ్వరయ్యపై చెప్పలేనంత కోపం వచ్చింది సరళకు.

"అంత పెద్దాయన. ఆ మాత్రం జ్ఞానం ఉండక్కర్లా! పిల్లవాడి ఏడ్పు వినబడలా? బయట రిక్షావాడి కేకలు వినబడలేదా? పోనీ పెద్దాయన నాలుగు రోజులుండి వెళ్ళిపోతారు! అని తాను ఎంతో నిగ్రహించుకుని మర్యాద ఇస్తోంది. మామగారినన్న టెక్కు బాగా చూపిస్తున్నారు. ఈయన సరేసరి. ప్రొద్దుట పోయి సాయంత్రం ఏ 6 గంటలకోగాని రారు. నా బాధలు ఈయనకేం అర్థమవుతాయి?!' అనుకుంటూ సహించలేక పిల్లవాడిని రెక్కపట్టుకుని బరబరా ఈడ్చుకుంటూ మామగారి మీద కోపం అంతా అణుచుకుని, ఎంతో సరళంగా 'చూడండి! మామయ్యా! వీడు వంటగదిలో నానారభసా చేస్తూ నన్ను పనిచేసుకోనీడం లేదు. రమని స్కూలుకి పంపాలి. టైము అయింది. మీ అబ్బాయి వచ్చారంటే నానాహంగామా చేస్తారు. కొంచెం వీడిని ఓ పది నిమిషాలు పట్టుకుంటారా?" అంది సరళ.

ఈశ్వరయ్య సరళను చిన్నినీ ఎగాదిగాచూసి 'వీడిని చూడ్డం నావల్ల కాదు' అందామనుకుని ఏమనుకున్నాడో ఏమో 'రా...రా బాబూ. ఏమిటీ! అల్లరి చేస్తున్నావా' అంటూ చిన్నిని అందుకున్నాడు. బొమ్మలబుట్ట తీసి బొమ్మలన్నీ వాడిముందు పోశాడు. వాడు వాటితో ఆడుకుంటుంటే తాను మళ్ళీ పేపరు అందుకున్నాడు. చదువుతున్నాడన్నమాటేగాని మనసు పేపరు విషయాలమీదకి పోవడంలేదు. 'ఏమిటీ సరళ ఉద్దేశ్యం? ఏం? నేను వీళ్ళకి ఆయాగా వచ్చాననుకుందా! నేను లేనప్పుడేంచేశారుట?' అంటూ మధనపడసాగాడు.

వంట ఇంట్లో నుంచి వచ్చి సరళ రమను రిక్షా ఎక్కించి ఇంట్లోకి వెళ్ళబోతున్నదల్లా ఒక్క అడుగు వెనక్కువేసి 'మామయ్యా! మీరేమీ అనుకోనంటే...' అంటూ నసిగింది. 'ఏమిటో చెప్పు' అన్నట్లు అసహనంగా చూశాడు ఈశ్వరయ్య. 'ఇంట్లో నెయ్యి అయిపోయింది. ప్రొద్దుట పనిమనిషితో చెప్పి తెప్పించడం మరచిపోయాను. నెయ్యిలేందే మీ అబ్బాయికి ముద్దదిగదు. పైగా తెప్పించలేదని నన్ను తిడ్తారు. కొట్టు ఎంతో దూరంలేదు. ఈ సందు చివరే. నేను వెళ్దామనుకుంటే పొయ్యిమీద వంట ఇంకా కాలేదు. మీరు కొంచెం వెళ్ళి తీసుకువస్తారా?' అంటూ నేతి క్యారేజీ, డబ్బులు తీసుకు వచ్చి ముందుకు జాపింది సరళ. 'నేను మీకు పనిమనిషిగా కనబడుతున్నానా? నేను వెళ్ళను'—అందామని నాలిక చివరిదాకా వచ్చి, ఒక్క నిమిషం తటపటాయించి 'ఏదీ. ఇలాతే' అంటూ వాటిని అందుకుని చెప్పులు తొడుక్కుని రుసరుసలాడుతూ బయలుదేరాడు ఈశ్వరయ్య. వెనకాలే వచ్చి తాతయ్య చెయ్యి పట్టుకున్నాడు చిన్ని సరే తప్పదనుకుంటూ చిన్నినెత్తుకుని బయలుదేరాడు ఈశ్వరయ్య.

ఈశ్వరయ్య మనస్సు కుతకుతలాడిపోతోంది. 'ప్రొద్దుట పిల్లవాడు అల్లరి చేస్తున్నాడు, 'ఆడించండి! అంటూ తనకు అప్పజెప్పిపోయింది. ఇప్పుడు పనిమనిషికి చెప్పడానికి మరచానంటూ కొట్టుకువెళ్ళి నెయ్యి తెమ్మంది. ఇక ముందుముందు వీళ్ళకి ఫుల్‌టైమ్ సర్వెంటు అవాలి కాబోలు. పైకి మాత్రం సరళ నమ్రతగానూ, తన్ని ఎంతో గౌరవిస్తున్నట్లుగానూ, ఎంతో అవసరమైతేగాని లేనిపనులు తనకు చెప్తున్నట్లుగా ప్రవర్తిస్తోంది. ఎక్కడా, ఎప్పుడూ తన్ని అగౌరవపరుస్తున్నట్లుగా ఉండదు. అందుకే తాను 'నేనీపని చెయ్యను' అని చెప్పలేకపోతున్నాను' అనుకుంటూ నడుస్తున్నాడు ఈశ్వరయ్య. కొట్టు అట్టేదూరం లేదు. నెయ్యి పోయించుకున్నాడు. ఇంటికి రాగానే తిరిగి కూరలు తెమ్మంటుందేమోనని మిగిలిన డబ్బులతో కొన్ని కూరలు కొనుక్కుని మనుమడితోసహా ఇంటికి వచ్చాడు ఈశ్వరయ్య.

కోడలు సరళ ఎదురుగా వచ్చి నెయ్యి అందుకుని కూరలు తెచ్చినందుకు తన సంతోషాన్ని వెలిబుచ్చి 'చాలా బాగున్నాయంటూ' మెచ్చుకుంది. సరళ లోపలికి వెళ్ళగానే తిరిగి కుర్చీలో కూర్చున్నాడు ఈశ్వరయ్య.

• • •

ఈశ్వరయ్య భార్య సుగుణమ్మ బ్రతికున్నన్నాళ్ళు అందరూ, అదే కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు తనను ఎంతో గౌరవంగా చూసుకునేవారు. ఏడాది క్రిందట భార్య పోయినప్పటి నుండి విశాఖపట్నంలో తాను వంటరిగా హోటళ్ళల్లో తింటూ కాలం గడిపాడు. తాను రిటైర్ అయిన రెండు నెలల నుండీ తనకు రావలసిన పెన్షన్, పి.ఎఫ్ మొదలైన కాగితాలు చూచుకుని అక్కడే ఉన్నాడు. అన్నీ సెటిల్ చేసుకుని బెజవాడలో ఉన్న ఒక్కగానొక్క కొడుకు రామంవద్దకు బయలుదేరాడు. దారిలో రాజమండ్రిలో ఉన్న కూతురు కుముద వద్ద దిగాడు. కుముద తనను సంతోషంగా ఆహ్వానించింది. రానురాను అన్నిపనులూ పురమాయించేది. ఒకసారి 'ఏమిటి నాన్నా ఊరికే చెప్పుల్లో కాళ్ళుపెట్టుకుని కూర్చుంటే ఏం తోస్తుంది? ఎప్పుడూ ఆ పుస్తకాలు, పేపర్లు పెట్టుకుని కూర్చుంటావు. మీ అల్లుడు అలసిపోయి ఇంటికి వస్తారు. కాస్త బజారుపనులు, కూరలు, అవీ తీసుకువస్తుంటే నీకు మార్పుగానూ ఉంటుంది. ఎక్సర్‌సయిజ్‌గానూ ఉంటుంది' అంటూ మొహమాటంలేకుండా 'నాన్నా ఇది తీసుకురా, అది తీసుకురా' అంటూ బజారుకు పదిసార్లు పంపేది. తాను తెచ్చే ప్రతి పనికి వంకలు పెట్టేది.

ఏణ్ణర్ధం పిల్లని తనవద్ద వదిలి కూతురూ అల్లుడూ సినిమాలకని, షికార్లకని వెళ్ళేవారు. ఆ పసిపిల్లతో తానెన్ని అవస్థలు పడ్డాడు. కుముద ఆవిధంగా చేస్తే తాను కూతురు మీద ప్రేమ చేత సర్దుకోగలిగాడు. తనని ఎన్నెన్ని మాటలనేది! ఎన్నిపనులు చేయించుకొనేది. ఇంత చేసినా తన మనస్సుకు కష్టమనిపించలేదు. ఏ కొంచం కష్టం కలిగినా వెంటనే మరచిపోయేవాడు. ఎందుచేత? కుముద తన కూతురు. కూతురి మీద ప్రేమ. ఇంతకన్న ఎక్కువ అనుభవించినా కష్టమనిపించలేదు. కాని ఈ రోజేమిటి! తన మనస్సు ఇంత బాధపడ్తోంది? ఎవరి తప్పు. అసలు తప్పెక్కడుంది? తప్పంతా తనదే. కూతురి మీద మమకారం ఆ కష్టాలన్నీ సహించేయగలిగింది. అక్కడ ఎన్ని అసౌకర్యాలు సర్దుకున్నాడు

'కానీ ఇక్కడ... సరళ కుముదలా కాకుండా తన్ను ఎంతో గౌరవంగా చూస్తోంది. తప్పనిసరియితేగాని ఏపనీ చెప్పదు. అదీ ఎంతో బాధపడ్తూచెప్తుంది. అసలు కూతురు, కోడలన్న భేదభావం తనలో ఉంది. కోడలనేటప్పటికి తాను మామగారన్న అంతస్థు, అహం తనలో రేకెత్తింది. ఆమె ఏది చెప్పినా తన మనస్సుకు బాధకల్గుతోంది. తనని అగౌరవపరచినట్లుగా భావిస్తున్నాడు. అంతా తన మనస్సులో ఉంది. తనకేం పట్టనట్లుగా కూర్చుంటున్నాడు. ఇది ఎవరి ఇల్లు? తన కొడుకుది.. అంటే తనదేగా! పాపం! సరళ. ఒక్కతీ ప్రొద్దుటపూట పిల్లల్తో ఎంత అవస్థ పడ్తోంది. ఇక సరళకి కష్టం కలిగించకూడదు. తనకు చేతనయినంతవరకు సహాయం చేస్తాడు. సరళను కుముదగానే భావిస్తాడు. సంతోషపెడ్తాడు' అనుకునేటప్పటికి ఈశ్వరయ్య మనస్సులో బాధంతా చేతితో తీసివేసినట్లయింది. మనస్సు తేలికయింది. హాయిగా ఉంది మనస్సు ఇప్పుడు.

'సరళా! సరళా!' అంటూ మామగారు పిలిచేటప్పటికి హడలిపోయింది సరళ. మామగారికి 'ఏం కోపం వచ్చిందో! తాను ఏ తప్పు చేయలేదు కదా వారి విషయంలో' అనుకుంటూ చెమటలు కారుతున్న మొహంతో చేతులు తుడుచుకుంటూ వంట ఇంట్లోంచి వచ్చింది సరళ. సరళ మొహం చూసేటప్పటికి ఈశ్వరయ్య హృదయం ద్రవించిపోయింది. 'ఏమ్మా సరళా! అబ్బాయికి ఏదో తీసుకురావాలని పని చెప్తున్నట్లున్నావ్. చూడమ్మా! నేను చెప్పే విషయాలు జాగ్రత్తగా విను. ఇకనుంచి చిన్నపని, పెద్దపని ఏదన్నా నాతో చెప్పిచేయించుకోడానికి సందేహించకు. నేను మాత్రం ఊరికే కూర్చుని ఏం చేస్తాను చెప్పు. నాకూ మార్పు కావాలిగా. అబ్బాయి పాపం అలసిపోయి వస్తాడు. నీవు మా ఇంటికి వచ్చినప్పుడే మా అమ్మాయివి అయావు. నీవు ఒకటి, కుముద ఒకటి కాదు నాకు. ఇద్దరూ సమానమే. అయినా ఇది ఎవరి ఇల్లు? మనది. ఇకనుండి నేను నీకు మామయ్యను కాను...' అని ముగించేలోపలే 'తండ్రి వంటివారు' అంది సరళ అప్రయత్నంగా.

ఈశ్వరయ్య అన్న మాటలు విన్న సరళ సంతోషానికి అవధులు లేవు. ఈశ్వరయ్య సరళకు సాక్షాత్తు పరమేశ్వరుడుగా కనిపించాడు ఆ క్షణంలో. వంగి కాళ్ళకి నమస్కరించింది. మనస్ఫూర్తిగా ఆశీర్వదించాడు ఈశ్వరయ్య కాదు పరమేశ్వరయ్య.

—యం.కమలాదేవి